క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని మాదిగ జేఏసీ పార్లమెంట్ కన్వీనర్ వంగూరి జయశంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాదిగ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం సహకరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ కులాలలోని ఉపకులాల వారందరికి వర్గీకరణ ఫలాలు అందేలా పాటు పడాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు హుస్సేన్, రాము, మహేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు



వెల్దండ: అర్హులైన యువతీ, యువకులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలో 39 పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆదివారం కూడా ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు. నూతన ఓటరు నమోదుతో పాటు తప్పులను సరిచేయనునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్‌నాయక్, బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.

ఏఎన్‌ఎంల మహాసభల పోస్టర్లు విడుదల



కొల్లాపూర్: రెండో ఏఎన్ఎంల రాష్ట్ర మహాసభల పోస్టర్లను శనివారం పట్టణంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెడు శివ శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈనెల 17వ తేదీ నిర్వహించే మహాసభలకు రెండో ఏఎన్ఎంలు తరలిరావాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కట్టా మంజుల, యశోధ, శ్వేత, వసుంధర, నిర్మల, పుష్ప, సరళ తదితరులు ఉన్నారు.

కంపచెట్లను తొలగిస్తాం

దోమలపెంట: శ్రీశైలం ప్రధాన రహదారికి ఇరు వైపులా ఉన్న కంపచెట్లను తొలగిస్తామని రాష్ట్ర హైవే అథారిటీ ఏఈ చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన దోమలపెంటలో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామం అధ్యక్షుడు కె.మోయిజ్, రసూల్ తదితరులతో కలిసి శ్రీశైలం ప్రధాన రహదారిలో ఉన్న కంపచెట్లను పరిశీలించారు.

ప్రమాదకరంగా గుంత



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రం నుంచి నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు వెళ్లే రహదారి పెద్ద కార్వాముల రోడ్డు మలుపు వద్ద ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు, అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకొని అసంపూర్తిగా రోడ్డుకు మరమ్మతు చేపట్టి గుంతను పూడ్చాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం



కోడేరు: మండలంలోని ఎత్తం గ్రామశివారులో ప్రధాన రహదారి పక్కన 11కేవీ విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. గత వర్షాలకు స్తంభం అడుగు భాగంలో మట్టి కొట్టుకుపోవడంతో స్తంభం ఒరిగింది. విద్యుత్‌శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒరిగిన స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



తిమ్మాజిపేట మండలం గుమ్మకొండలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ సురేష్



కల్వకుర్తి మండలం తర్నికల్‌లో పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ దేవసహాయం



ఉప్పునుంతలలో సర్వే మెటీరియల్‌ను అందజేస్తున్న ఆర్డీఓ మాధవి, ఇతర అధికారులు

ముమ్మరంగా సమగ్ర సర్వే

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, ఆదాయ, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే సాఫీగా సాగుతోంది. ఇప్పటికే మొదటి దశ ఇళ్ల గుర్తింపు, స్టిక్కరింగ్, యాజమానుల పేర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేసిన ఎన్యూమరేటర్లు రెండో దశలో శనివారం కుటుంబాల వారీగా సమగ్ర వివరాలు సేకరణలో నిమగ్నమయ్యారు.



నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దనూర్‌లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

■ నాగర్‌కర్నూల్ మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు 77 మంది ఎన్యూమరేటర్లను, 10 మంది సూపర్‌వైజర్లను నియమించారు. మొదటిరోజు సర్వే ఆలస్యంగా ప్రారంభమైంది. మూడు ఇళ్ల వరకే సేర్వే చేసి వివరాలు నమోదు చేశారు. కొన్ని గ్రామాల్లో సర్వే ప్రారంభించలేదు.

■ అచ్చంపేటలో మొదటి రోజు సర్వే ఆలస్యంగా ప్రారంభమైంది. 60 ఎన్యూమరేషన్ బ్లాక్‌లో 280 కుటుంబాల వివరాలు సేకరించారు. మున్సిపాలిటీలో 60 ఎన్యూమరేషన్ బ్లాక్‌లకు గాను 6,600 సర్వే ఫారాలు అవసరం కాగా శుక్రవారం రాత్రి వరకు 800 ఫారాలు మాత్రమే అందాయి.

■ కల్వకుర్తి మండలం తర్నికల్‌లో సర్వేను అదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ దేవసహాయం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలోని సర్వే ప్రారంభం అయ్యింది. ఉదయం మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వేపై ఎన్యూమరేటర్స్‌కు శిక్షణ ఇవ్వడంతోపాటు సర్వేఫారాలు, మెటీరియల్‌ను అందజేశారు.

■ పెద్దకొత్తపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో సర్వే ప్రారంభమైందని ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు.

■ ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని చారకొండ ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, తహసీల్దార్ సునీత, డీటీ విద్యాధరి ఎన్యూమరేటర్లకు సూచించారు.

■ తాడూరు మండలంలోని అంతారం, యాదిరెడ్డిపల్లి, ఎట్టిదారిపల్లి గ్రామాలను తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ బ్రహ్మాచారి పరిశీలించారు. సర్వేపై అవగాహన కల్పించారు.

■ బిజినేపల్లి మండలం పాలెంలో డీపీఓ రామ్మోహన్, మండల కేంద్రంలో ఆర్డీఓ సురేష్ ఇంటింటి సర్వేను పరిశీలించారు.

■ కోడేరు మండలంలోని జనుంపల్లి, బావాయిపల్లిలో సర్వేను తహసీల్దార్ విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ తో కలిసి తహసీల్దార్ సర్వే మెటీరియల్ పంపిణీ చేశారు.

■ కొల్లాపూర్ మండలంలోని అమరగిరిలో ఇంటింటి సర్వేను ఆర్డీఓ బన్సీలాల్, డీఎల్‌పీఓ శ్రీరాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, ఎంపీడీఓ మనోహర్ ఉన్నారు. పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు, కమీషనర్ శ్రీనివాసన్‌లు సర్వేను పర్యవేక్షించారు.

■ మన్ననూర్ అంబేద్కర్ కాలనీలో రెండు ఇళ్లు మాత్రమే సర్వే చేసి ముగించారు.

■ లింగాలలో సర్వేను నోడల్ అధికారి సీతారాం నాయక్, ఎంపీడీఓ అంజనేయులు, ఎంపీఓ చంద్రశేఖర్ పరిశీలించారు.

■ ఉప్పునుంతల మండల కేంద్రంలోని రైతువేదికలో సర్వేకు సంబంధించిన మెటీరియల్‌ను అచ్చంపేట ఆర్డీఓ మాధవి అందజేశారు. ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ నారాయణ, తహసీల్దార్ కేశవ, ఎంఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

■ బల్మూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో కుటుంబాల వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేశారు.



కోడేరులో..

■ అమ్రాబాద్ మండలం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వేపై 73 మంది ఎన్యుమరేటర్లు, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ సమావేశం నిర్వహించారు.మండల ప్రత్యేకాధికారిణి డాక్టర్ రజని, ఎంపీడీఓ వెంకటయ్య, తహసీల్దార్ శైలేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ రావూష్ తదితరులు ఉన్నారు.

■ కుటుంబ సమగ్ర సామాజిక ఆర్థిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలకపల్లి తహసీల్దార్ జాకీర్‌అలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డిలు ఎన్యుమరేటర్‌లకు సూచించారు. మండల కాంప్లెక్స్ మీటింగ్‌హాల్‌లో సర్వే సామగ్రి పంపిణీ చేశారు.

■ తిమ్మాజిపేట మండలం గుమ్మకొండలో సర్వేను ఆర్డీఓ సురేష్ పరిశీలించారు. 26 గ్రామ పంచాయతీలలో సర్వే చేపట్టారు. 81 మంది ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహించారు. 10 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు. ఎంపీడీఓ లక్ష్మీదేవి సర్వే కిట్లను అందజేశారు



తెలకపల్లిలో సర్వే మెటీరియల్‌ను అందజేస్తున్న అధికారులు



అచ్చంపేటలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



తాడూరు మండలం అంతారంలో



చారకొండలో



కొల్లాపూర్ మండలం అమరగిరిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్, డీఎల్‌పీఓ శ్రీరాములు

ఇష్టంతో చదివితే లక్ష్య సాధన

బల్మూర్: ఇష్టంతో చదివితే లక్ష్య సాధన సులువు అవుతుందని మోటీవేషనల్ స్పీకర్, ప్రేరణ విద్యా ఉద్యమం వ్యవస్థాపకుడు నాగల్ల శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో శనివారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలను ఎలా గుర్తుంచుకోవాలి, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే దానిపై ప్రేరణ కల్పించారు. కార్యక్రమంలో విద్యాలయం ఎస్ఓ లలితాబాయి, ఉపాధ్యాయులు జ్యోతి, విజయలక్ష్మి, స్వరూప, విజయ, మంజుల, సుజాత తదితరులు పాల్గొన్నారు.



క్రీడలతో ఉజ్వల భవిష్యత్

కల్వకుర్తి టౌన్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల ఎంపికలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. అనంతరం నిర్వహించిన అండర్–08, 10, 12 అథ్లెటిక్ క్రీడావిభాగాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 250 మంది విద్యార్థులలో 25 మంది పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఎంపికైన వారు డిసెంబరు 1వ తేదీన మంచిర్యాల జిల్లా ఉషోదయ హైస్కూల్ స్టేడియంలో నిర్వహించే సబ్ జూనియర్ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు భిక్షపతి, పరశురాము, అంజయ్య, పీఈటీలు ప్రసాద్, సైదులు, నిర్మల, రాధిక, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మల్లేశ్వరం ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పెంట్లవెల్లి: మల్లేశ్వరం ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణానది నుంచి మినీలిఫ్ట్ ఎత్తిపోతల పథకం కోసం రూ.30 కోట్ల నిధులకు సంబంధించి ప్రొసిడింగ్ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పూర్తైతే మల్లేశ్వరం, వేముకల్, ఎంగంపల్లితండా, చెన్నంపల్లి, సోమశిల, మంచాలకట్ట గ్రామాల శివారులో ఉన్న దాదాపు 1400 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మినిలిఫ్ట్ ఎత్తిపోతల పథకంపై శ్రద్ధ తీసుకొని సాగునీరు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, మాజీ సర్పంచ్ రాజేష్, సురేందర్‌గౌడ్, ఎస్‌కే ఖాజా, మతిన్‌లు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కందికొండ గీత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన గెస్ట్ అధ్యాపకుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లెక్చరర్‌లను అకస్మాత్తుగా తొలగించడం చట్ట విరుద్ధం అన్నారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపక సంఘం జిల్లా అధ్యక్షుడు కావలి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందంగౌడ్, నాయకులు బాలగౌడ్, రవీందర్‌గౌడ్, సుధాకర్, రాములు, గీతిక, దశరథం, ముజాఫర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందికొండ గీత

నిత్యాన్నదానానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న గుజరాత్‌కు చెందిన దంపతులు

అచ్చంపేట రూరల్: శ్రీశైలంంత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు సహకరిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి తెలిపారు. శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విరాళాలు అందజేశారు. గుజరాత్‌కు చెందిన డాక్టర్ శిల్ప, గిరినారాయణ దంపతులు రూ.25 వేలు, లింగాల మండలం అంబట్‌పల్లికి చెందిన వేమూరి శ్యామలమ్మ, బస్వరాజ్ దంపతులు రూ.25 వేలు, అచ్చంపేట మండలం రంగాపూర్‌కు చెందిన బొల్లంపల్లి శకుంతల, కృష్ణయ్య, నరేందర్, జ్యోతి రూ.11వేలు అందజేసినట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ పాలక మండల సభ్యులు పాల్గొన్నారు.

అడుగడుగునా పైప్‌లైన్ లీకేజీలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ అడుగడుగున లీకేజీ అవుతోంది. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. మూడు రోజుల పాటు మండల కేంద్రంలో నీటి కొరత ఏర్పడింది. మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుకు అనుసరించుకొని పోలీసు స్టేషన్ సమీపాన వారం రోజులుగా లీకేజీ అయిన నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మిషన్ భగీరథ నీరు ఇరువైపులా వ్యాపించి పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న లీకేజీ నీరు

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



నిషాంత్ గౌడ్ (ఫైల్)

తాడూరు: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఐతోల్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎల్లగౌడ్ కుమారుడు నిషాంత్‌గౌడ్(8) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో ఆడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఉన్న ఒక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

గుండెపోటుతో వ్యక్తి..

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన కాలే వెంకటయ్య(40) శనివారం గుండె పోటుతో మృతి చెందాడు. టెంట్‌హౌజ్‌లో కూలీ పనులు చేస్తు జీవిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి ఇంట్లో నిద్రించగా అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య నాగమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన సాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శనివారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట విజయ్‌గౌడ్, సూర్యప్రకాష్‌రావు, బాలయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీశైలం, మల్లేష్, లింగం, నరేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన వీఆర్ఏ బోయ నర్సింహ(90) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మృతదేహంపై ఆర్ఐ రామస్వామి పూల మాల వేసి నివాళులర్పించారు. రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

అడవి పందుల బెడద



అడవి పందుల దాడిలో నాశనమైన మొక్కజొన్న పంట

ఇబ్బందులు పడుతున్నాం



అడవి పందుల బెడద అధికంగా ఉంది. సాగు చేసిన పంటలను ధ్వంసం చేస్తున్నాయి. నిత్యం కాపలా ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నాం. పంటలను అడవి పందులు పూర్తిగా నాశనం చేస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– పర్వతాలు, కోడేరు

అడవి పందులను నివారించాలి..



పంటలను ధ్వంసం చేయకుండా అడవి పందులను నివారించాలి. గుంపులుగా రాత్రివేళలో పంటలను నాశనం చేస్తున్నాయి. వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతింది. ఫారెస్టు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మద్దిలేటినాయుడు, కోడేరు

కోడేరు: మండలంలోని సాగుచేసిన పంటలను అడవి పందులు దాడి చేసి పంటలను నాశనం చేస్తున్నాయి. ప్రస్తుతం రైతులు వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు. పందులు, కుందేళ్లు, నెమళ్లు గుంపులుగా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అడవి పందులు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో స్థావరాలు ఏర్పర్చుకొని రాత్రివేళలో పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

పొలాల వద్ద కాపలా..

రాత్రివేళలో అడవి పందులు పంటలను ధ్వంసం చేయకుండా రాత్రివేళలో రైతులు నిద్రించకుండా పంటలను కాపాడుకుంటున్నారు. పొలాల వద్ద కొంత మంది రైతులు మంటలు వేసుకొని కాపలా కాస్తున్నారు. కొంచెం అప్రమత్తంగా లేకపోయినా పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు పాత చీరలను సంతలో కొనుగోలు చేసి పంట చుట్టు కంచెను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒక్కొక్క రైతు దాదాపు 150 చీరల వరకు కొనుగోలు చేసి పంట చుట్టు కట్టి పంటలను కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు స్పందించి అడవి పందుల బెడద నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.



వేరుశనగ పంటకు చీరలతో కంచె ఏర్పాటు చేసిన రైతులు